క్లుప్తంగా

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ



పెన్నులు, ప్యాడ్స్ అందజేస్తున్న అధికారులు

చాగలమర్రి: స్థానిక బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలోని పదవ తరగతి విద్యార్థినులకు రైటింగ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్సులు, పెన్నులను మండల ప్రత్యేక అధికారి ముస్తాక్ అహ్మద్ శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ న్యామతుల్లా, సంక్షేమ అధికారి హరిత పాల్గొన్నారు.

వడ్డెరలు రాజకీయంగా ఎదగాలి

నంద్యాల(అర్బన్) : కుల వృత్తినే నమ్ముకుని దుర్భర జీవితాలను అనుభవిస్తున్న వడ్డెరలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని అందుకు ప్రభుత్వాలు వడ్డెరలకు అవకాశం కల్పించాలని అఖిలభారత వడ్డెర సమాజ సంఘం జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు కోరారు. స్థానిక వాల్మీకి కార్యాలయంలో ఏపీ రాష్ట్ర సంఘం కార్యదర్శి చల్లా వెంకటేష్ ఆధ్యక్షతన శుక్రవారం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు శివకృష్ణ, వెంకటసుబ్బయ్య, శివన్న, మదు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తులు నిల్

● నేటితో ముగియనున్న గడువు

కోవెలకుంట్ల: గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక దుకాణం కేటాయించారు. ఉయ్యాలవాడ మండలానికి ఒక దుకాణం మంజూరైంది. ఈ నెల 5వ తేదీ నాటికి దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించగా ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో గడువును ఈ నెల 8వ తేదీ వరకు పెంచారు. దరఖాస్తుదారులు రూ. 2 లక్షల దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంది. గడువు పెంచినప్పటికీ దరఖాస్తులు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు అందకపోవడం గమనార్హం. శనివారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియనుండగా ఒక్క రోజులో ఏ మేరకు దరఖాస్తులు అందుతాయో వేచి చూడాల్సిందే.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ, మహా మంగళ హారతులు తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవాన్ని చేపట్టారు. మహాధ్వజ స్తంభం వద్ద స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి తిరిగి అలంకార మండపానికి చేర్చారు.

గోశాల చుట్టూ ఆరడుగుల ఫెన్సింగ్




ఏఈఓకి సూచనలిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: క్షేత్రంలోని గోశాల వద్ద గోవుల సంరక్షణ కోసం ఆరు అడుగుల ఎత్తులో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఏఈఓ ఎరమల మధు, ఏఈ శ్రీనివాసులుతో కలిసి దేవస్థానం గోశాల వద్ద శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఫెన్సింగ్ స్థానంలో నూతన కంచెను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేయాలన్నారు. అర్చకులు మూలస్థానం సుబ్బయ్య, పడితరం ఇన్‌చార్జ్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

ఘన చరితకు సాక్ష్యం

- 119 ఏళ్లు పూర్తి చేసుకున్న హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి
- నేడు 120వ వార్షికోత్సవం, కోత పండుగలు



అద్భుత నిర్మాణ శైలిలో హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి 1905లో ఫిబ్రవరి 8న ప్రారంభమై 119ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు 120 ఏళ్ల వార్షికోత్సవ సంబరాలు జరుపుకుంటున్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన చర్చి నిర్మాణం నేటికీ ఆకట్టుకుంటోంది.

పూర్వ చరిత్ర...

1855లో లండన్ మిషనరీలు ఎస్పీజీ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు.మొదట నంద్యాల కుందూనది పరీవాహక ప్రాంతంలో పాఠశాలను నిర్మించారు. నాడు అక్కడ పేద ప్రజలకు విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన నిర్మాణం వరదల్లో మునకకు గురైంది. అనుకూల ప్రాంత కానందున అక్కడ నుంచి ఎస్పీజీ మిషన్ వారు ప్రస్తుతం ఉన్న ఎస్పీజీ పాఠశాల ప్రాంతంలో పెద్ద గుడిసె వేసి విద్యార్థులకు చదువు చెబుతూ, ప్రార్థనలు చేసేవారు.

ప్రస్తుత ఆలయ చరిత్ర..

ఇంగ్లాండ్ నుంచి నంద్యాలకు మిషనరీగా వచ్చిన రెవ.ఆర్థర్ ఇన్‌మన్ 1902 జూన్ 26న హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి నిర్మాణానికి పునాది వేశారు. నిర్మాణంకు వాడే రాళ్లను పులిమద్ది గ్రామ సమీపం నుంచి ఎడ్ల బండ్లలో తీసుకొచ్చారు. నిర్మాణానికి సున్నం, ఇసుక, గుడ్లు మిశ్రమంతో గానుగ తిప్పిన మిశ్రమాన్ని వాడారు.ఈ మోర్టర్ ఎంతో పటిష్టంగా ఉండటంతో నేటికీ నిర్మాణం చెక్కు చెదరలేదు. నిర్మాణాన్ని మద్రాసులో నుంచి వచ్చిన తమిళవాసి అంబ్రోస్ పర్యవేక్షణలో పూర్తి చేశారు.

ఆలయ గోపుర నిర్మాణం...

ఆలయ గోపురం యేరుషలేంలోని చర్చి నిర్మాణ శైలిని పోలిఉందని చరిత్రకారులు చెబుతారు. మిషనరీలు ఉష్ణ ప్రాంతంగా గుర్తించి ఆలయంపై కప్పు దాదాపు 35అడుగుల ఎత్తులో, కేరళ నుండి తేబడిన ఎర్రటి రంగులతో ఉన్న పెంకులతో కప్పబడింది. పైకప్పు నిర్మాణానికి బర్మా టేకును ఉపయోగించారు.

పచ్చదనం, పర్యావరణం...

పచ్చదనానికి ఈ ఆలయం నిలయం. అనేక మొక్కలతో పాటు 80 సంవత్సరాల వయస్సు కలిగిన మహా వృక్షాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ప్రధాన ద్వారం ఇరువైపులా రెండు ఏనుగు మర్రి మహా వృక్షాలు స్వాగతం పలుకుతున్నట్లు నాటారు. ఇజ్రాయిల్‌లో లభించే ఆలివ్, అన్జూరపు చెట్లు ఉన్నాయి.

బాప్టిజం తొట్టి..



బాప్టిజం తొట్టి ఏకశిలతో తయారు చేశారు. దీనిని దేవశిఖామణి వారి సతీమణి జ్ఞాపకార్థం ఆలయంలో ఏర్పాటు చేశారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన బెల్‌ను లండర్ నుంచి తెప్పించారు. దీని బరువు 500 కేజీలకు పైగా ఉంది. ఈ బెల్ శబ్దం 20కి.మీ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాలకు వినపడేదని ఆయా గ్రామాల్లోని పెద్దలు చెబుతున్నారు.



చర్చి లోపలి భాగం

నేడు చర్చి ప్రారంభోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రైల్వేస్టేషన్ వెళ్లే రహదారిలో అతిపురాతనమైన దేవాలయ ఆవరణలో నూతనంగా క్రైస్తవులందరూ కలిసి హోలీక్రాస్ సెయింట్‌నరీ చర్చిని నిర్మించుకున్నారు. చర్చి నిర్మాణం పూర్తి కావడంతో ఈనెల 8వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక పార్థనలతో చర్చి ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జి బిషప్ దిరైట్ రెవరెంట్ జార్జి కొర్నేలీ, డోర్నకల్ బిషప్ పద్మారావు, నంద్యాల డయాసిస్ రిటైర్డ్ బిషప్‌లు డాక్టర్ పీజే లారెన్స్, డాక్టర్ పుష్పలలితమ్మ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని చర్చి డీనరీ చైర్మన్ కొత్త మాసీ జోసఫ్ బాబు,సెక్రటరీ ప్రభుదాస్, స్టీపెన్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హాజరయ్యే భక్తులందరికీ ప్రేమవిందును ఏర్పాటుచేశారు.

కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ

నంద్యాల(న్యూటౌన్): జేఎన్‌టీయూ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో సమున్నీసా పీహెచ్‌డీ పట్టా పొందినట్లు ప్రొఫెసర్ డాక్టర్ సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ సునీల్‌కుమార్ మార్గదర్శకత్వంలో అధునాతన గూఢాచారి గుర్తింపు, అనువర్తిత సంకేత పదాల నిర్మాణాన్ని సమగ్రీకరించడం ద్వారా క్లౌడు భద్రతను పెంపొందించడం అనే అంశంపై సమున్నీసా పరిశోధన పత్రం సమర్పించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ అశోక్‌కుమార్ ఆమెను అభినందించారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

శిరివెళ్ల: పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై హెచ్ఎం తిరుపతిరెడ్డిని ఆరా తీశారు. ఈ ఏడాది 28 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని హెచ్ఎం తెలిపారు. 28 మందిలో 20 మంది ఏ గ్రేడ్, 8 మంది బీ గ్రేడ్‌లో ఉన్నారని చెప్పారు. గతేడాది 30 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 29 మంది పాస్ అయ్యారని తెలిపారు. ఈ ఏడాది అందరూ పాస్ కావాలని డీఈఓ ఆదేశించారు. ఒక్కో టీచర్ 5గురు విద్యార్థులను దత్తత తీసుకొని ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలని డీఈఓ సూచించారు.



పదవ తరగతి స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

మోడల్ పరీక్ష విజయవంతం

నంద్యాల(న్యూటౌన్) : పట్టణంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞావికాసం మోడల్ పరీక్ష విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయక్ తెలిపారు. పదవ తరగతి మోడల్‌పరీక్ష ప్రశ్నాపత్రాలను డీఈఓ జనార్ధన్‌రెడ్డి విడుదల చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మోడల్ పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలో మొత్తం 5వేల మంది విద్యార్థులు మోడల్ పరీక్షలో పాల్గొన్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజా పాల్గొన్నారు.

కమనీయం..సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



రథం లాగుతున్న భక్తులు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం స్వామి వారికి అభిషేకం, కలశ పూజ, మన్యసూక్త హోమం తదితర కార్యక్రమాలను నరహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ మురళీమోహన్ రెడ్డి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి, కమిటీ సభ్యులు వంగాల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను గావించి మేళతాళాలతో రథం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం రథంపై కొలువుంచి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్త జనుల జయజయ ధ్వానాల మధ్య రథోత్సవం సాగింది. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

విజయం కోసం పోరాడాలి

కర్నూలు న్యూసిటీ: క్రీడ ఏదైనా విజయమే లక్ష్యంగా పోరాడాలని రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అండర్–18 నెట్‌బాల్ క్రీడాకారులకు సెలక్షన్స్ శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహబూబ్ బాషా మాట్లాడుతూ.. శారీరక, మానసిక దృఢత్వానికి నెట్‌బాల్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. సెలక్షన్లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేత జట్లకు కప్‌లు అందజేశారు. నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకులు నాగరత్నమయ్య, అధ్యక్షుడు నాగేశ్వరబాబు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన కర్నూలు జిల్లా జట్టు

శ్రీశైల దేవస్థాన వైద్యశాలకు పరికరాల విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశాలకు హైదరాబాద్‌కు చెందిన ఇందుకూరి సిద్ధార్థరెడ్డి వైద్యపరికరాలను విరాళమిచ్చారు. రూ.4లక్షల విలువ చేసే వైద్య పరీక్షల పరికరాలను శుక్రవారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు. దాతకు ఈఓ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు గంజి రవి, ఎం.శ్రీనివాసరావు, అపోలో వైద్యులు సాయికిషన్, సంఘమేష్ పాల్గొన్నారు.



వైద్యపరికరాలను అందజేస్తున్న సిద్దార్థరెడ్డి

దేవస్థానానికి వస్తువుల వితరణ

శ్రీశైల దేవస్థానానికి శుక్రవారం అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, జేసీ ప్రభాకర రెడ్డి కుటుంబ సభ్యులు 379 గ్రాముల బంగారు కూర్మ సింహాసనం, 249 గ్రాముల పళ్లెమును విరాళమిచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు బంగారు వస్తువులను ఈఓ ఎం.శ్రీనివాసరావు, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయస్వామిలకు అందజేశారు. దాతలకు దేవస్థానం తరఫున స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏఈఓ బి.మల్లికార్జున రెడ్డి, పీఆర్వో టి.శ్రీనివాసరావు ఉన్నారు.

ఆసుపత్రి పేయింగ్ బ్లాక్‌లో డీలక్స్ రూమ్‌లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పేయింగ్ బ్లాక్‌లో త్వరలో డీలక్స్ రూమ్‌లు ప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలో గ్రాండ్ రౌండ్స్‌లో భాగంగా పలు ఓపీ విభాగాలైన మెడికల్, ఆర్థోపెడిక్, చిన్నపిల్లల, గైనిక్, సూపర్ స్పెషాలిటీ ఓపీలతో పాటు ఎంసీహెచ్, గైనిక్, డైట్ విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో వాటర్ లీకేజ్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని హెల్త్ ఇన్స్‌పెక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చూసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. చెప్పారు. ఫార్మసి డిపార్ట్‌మెంట్‌ను పరిశీలించి ఫార్మసి మాడ్యూల్స్‌లోని ఈ–హాస్పిటల్ అప్‌లోడింగ్ ప్రాసెస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఫార్మసి సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ మల్లేశ్వరమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు ఉన్నారు.

ఉపాధి నిధులు దుర్వినియోగం

- రూ. 1.33 లక్షలు దుర్వినియోగమయినట్లు గుర్తింపు
- నాటిన మొక్కలు మాయంపై ఏపీఓ, సిబ్బందిపై అధికారులు ఆగ్రహం
- ఇక మీదట ఆన్‌లైన్‌లోనే మస్టర్ల నమోదు
- ప్రొసీడింగ్ ఆఫీసర్ బాలాజీ నాయక్



మాట్లాడుతున్న బాలాజీ నాయక్

ఉయ్యాలవాడ : మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి పనుల్లో అక్రమాలు సామాజిక తనిఖీల్లో వెలుగు చూశాయి. రూ.1.33 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేలింది రూ.12,635 గ్రామసభలో రికవరీ చేశారు. దుర్వినియోగమైన నిధుల రికవరీకి అధికారులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన సామాజిక తనిఖీపై బహిరంగ సభ జరిగింది. ఆ శాఖ జిల్లా ప్రొసెడింగ్ ఆఫీసర్ బాలాజీ నాయక్, ఏపీడీ సాంబశివరావు, క్వాలిటీ కంట్రోలర్ అధికారి గంగాధర్ మాట్లాడుతూ మండలంలో 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు జరిగిన 900 పనులకు సంబంధించి రూ.6.27 కోట్లు కూలీల వేతనాలు, మెటీరియల్ కాంపోండ్ కింద ఖర్చు చేశారన్నారు. ఈ మేరకు జనవరి 25 నుంచి 10 రోజుల పాటు డీఆర్పీలు గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి విచారించారు. అలాగే పని చేసిన ప్రదేశాల్లో రికార్డుల ప్రకారం కొలతలు, మస్టర్ల పరిశీలన కొలతల్లో తేడాలు, గోకులం షెడ్లకు డబుల్ బిల్లులు మంజూరు చేయడం, సర్వాయిపల్లెలో పంట కాలువల్లో పని చేసే సమయంలో 50 మంది కూలీలు పని చేసినట్లు మస్టర్లలో నమోదు చేసి, ఫొటోలో మాత్రం కేవలం 7 మంది కూలీలు పని చేసినట్లుగా చూపించడం, నాటిన మొక్కలు చనిపోయినట్లు తేల్చారు. బాలాజీ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి పని ప్రదేశాలలో కూలీల నమోదు మస్టర్లలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇక మీదట ఆన్‌లైన్‌లో పని ప్రదేశం నుంచి నేరుగా కూలీల వివరాలను నమోదు చేయాలన్నారు. కొండుపల్లె, సర్వాయిపల్లె, పడిగెపాడు, రూపనగుడి, ఉయ్యాలవాడ గ్రామాలలో 20 మంది రైతులకు ఉద్యానవన పంటల సాగుకు ఇచ్చిన కొబ్బరి మొక్కలు, మునగ మొక్కలు లబ్ధిదారుల పొలాల్లో లేవని డీఆర్పీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రొసెడింగ్ ఆఫీసర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు ఉపాధి కల్పనపై సదస్సు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో శనివారం యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నంద్యాల డీన్ ఫాదర్ మర్రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సదస్సుకు కర్నూలు మేత్రాసనం పీఠాదిపతులు గోరంట్ల జ్వానేష్, డైరెక్టర్ ఫాదర్ రాజేంద్ర, కేడీఎస్ఎస్ డెరెక్టర్, ఫాదర్ సుదాకర్ పాల్గొని యువతకు సలహాలు, సూచనలిస్తారన్నారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ప్రసన్న కుమార్, కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

రగ్బీ క్రీడాకారులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ: ఏపీ సబ్ జూనియర్ బాలికల అండర్ – 15 జట్టుకు శిక్షణ కొనసాగుతోంది. శుక్రవారం దిన్నెదేవరపాడులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ క్రీడా మైదానంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను జరుగుతున్న శిక్షణను ఒలింపిక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పరిశీలించారు. క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగే పదవ జాతీయ స్థాయి సబ్ జూనియర్ అండర్–15 రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కోచ్ శ్రీకాంత్, నరసింహ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఈసీజీ ద్వారా గుండెపోటును గుర్తించాలి



రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ కో ఆర్డినేటర్ జఫ్రుల్లా

నందికొట్కూరు: ఈసీజీ ద్వారా గుండెపోటును గుర్తించాలని జిల్లా వైద్యశాఖ కో ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను జిల్లా వైద్యశాఖ కో ఆర్డినేటర్ తనిఖీ చేశారు. వార్డులో అందుతున్న వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాతి నొప్పి, ఆయాసం, స్పృహ కోల్పోవడం, గుండె దడ వంటి లక్షణాలతో వచ్చిన రోగులకు వెంటనే ఈసీజీ తీయాలన్నారు. ఈసీజీ ద్వారా గుండెపోటును గుర్తించి అత్యవసరమైన ఇంజెక్షన్ ఇచ్చి వారి ప్రాణాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, హెడ్ నర్స్ భువనేశ్వరి ఉన్నారు.

మెరుగైన సేవలందించాలి

మిడుతూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా హెల్త్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా సూచించారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు బయటకు రాయకూడదన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి రికార్డులు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిరుపతి, భరత్, శారద, లీనా, ల్యాబ్‌టెక్నిషియన్ సత్యనారాయణ, ఫార్మాసిస్టు మాదన్న ఉన్నారు.

బ్లాక్‌లో యూరియా అమ్మకం

- చాగలమర్రిలో యూరియా కొరత
- ఓ ఫెర్టిలైజర్ షాపులో బస్తా ధర రూ.380 ప్రకారం అమ్మకం
- ప్రభుత్వ ధర రూ.266.50
- గోదాంలో బిల్లులు లేని 110 బస్తాల యూరియా గుర్తింపు
- మామూళ్ల మత్తులో వ్యవసాయ అధికారులు!



యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయించి పేపర్‌పై బిల్లు వేసిన దుకాణాదారుడు



గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను గుర్తించిన ఏఓ

చాగలమర్రి: మండలంలో రబీ సీజన్‌లో రైతులు అధిక శాతంలో సజ్జ పంట సాగు చేయడంతో యూరియాకు డిమాండ్ నెలకొంది. చాగలమర్రి పరిధిలోని 5 ఆర్ఎస్‌కేలకు రెండు నెలల నుంచి సుమారు రెండు వేల బస్తాల యూరియాను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఎక్కువ శాతం రైతులకు యూరియా అవసరమవుతుండటంతో డిమాండ్ పెరిగింది. డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని స్థానిక ఓ ఎరువుల దుకాణదారుడు బస్తా రూ.380 నుంచి రూ.400కు విక్రయిస్తున్నట్లు రైతుల వాపోతున్నారు. అయితే విక్రయాలు బిల్లులు లేకుండా సాగిస్తున్నారని చెబుతున్నారు. బిల్లు అడిగితే స్టాకు లేదంటున్నారని రూ.380 చెల్లిస్తే ఇస్తున్నారని, తప్పనిసరి పరిస్థితులలో కొనుగోలు చేయవలసి వస్తుందంటున్నారు. ఆ దుకాణంలో ఉన్న యూరియా బస్తాలు వివిధ రైతుల పేర్లతో ఆర్ఎస్‌కేల్లో కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం రూ.266.50 ఆర్ఎస్‌కేల్లో విక్రయిస్తుంది.

ఏఓకు తెలియజేసినా పట్టించుకోలేదు

చాగలమర్రిలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారని ఏఓ రంగనేతాజీకి సమాచారమిచ్చాను. ఆయన దుకాణ యజమానికి సమాచారం ఇచ్చి యూరియా స్టాకును ఇతర ప్రాంతంలోకి తరలించాల్సిందిగా సూచించాడు. అప్రమత్తమైన దుకాణం యజమాని యూరియా బస్తాల ఇతర గోదాంలోకి మార్చాడు. దుకాణాదారుల నుంచి వస్తున్న మామూళ్లకు అలవాటు పడటంతో వారిపై చర్యలు తీసుకోవడం లేదు. శనివారం నామమాత్రం తనిఖీలు నిర్వహించి అధిక మొత్తంలో స్టాక్ ఉన్నప్పటికీ.. కొంత మాత్రమే చూపి బిల్లులు తేవాలని సమయం ఇచ్చాడు. ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. – రైతు సర్పంచ్ బాలీశ్వరరెడ్డి

113 బస్తాల యూరియా గుర్తించాం

ముత్యాలపాడు బస్టాండ్‌లో ఉన్న శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌కు సంబంధించిన చింతలచెరువు రోడ్డులో ఉన్న గోదాంలో నిల్వ ఉన్న 113 బస్తాల యూరియాను గుర్తించాం. వాటికి సంబంధించిన బిల్లులు లేకపోవడంతో అమ్మకాన్ని నిలిపి వేశాం. ఆ యూరియా బస్తాలను షాపు యజమాని తమ పంట పొలాలకు వినియోగించేందుకు రాజుపాళెం మండలంలోని కూలూరు గ్రామం ఆర్ఎస్‌కే నుంచి కొనుగోలు చేసి నిల్వ ఉంచినట్లు తెలిపారన్నారు. బస్తాలకు సంబంధించిన బిల్లులు వారంలోపు సమర్పించాలని చెప్పాం. – రంగనేతాజీ, మండల వ్యవసాయ అధికారి